# ఉద్యానవనాలు ఆనంద నిలయాలు

◆ **ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్**

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 6: ఉద్యాన వనాలు ఆనంద నిలయాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కరెంట్ ఆఫీస్ ఏరియాలోని ఊర గుట్ట (కోరగుట్ట) వద్ద నేచర్ పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి దగ్గరలో ఉన్న కోరగుట్ట వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి ఉద్యాన వనాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. పట్టణవాసులతో పాటు పరిసర ప్రాంతాల వాసులకు ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. సుమారు 115 హెక్టార్లలో రూ.1.50 కోట్లతో పార్కు నిర్మించామన్నారు. కోరగుట్ట చుట్టూ ప్రజలు ఆహ్లాదాన్ని పొందేలా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సీసీఎఫ్ భీమానాయక్, జిల్లా అటవీశాఖాధికారి కిష్ట గౌడ్, ఎఫ్‌డీవో కర్నావతి వెంకన్న, రేంజర్ గుగులోత్ నాగేశ్వరరావు, డీఆర్‌వో వీ సాల్మన్‌రాజు, బీ వీరులాల్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీలం రమేశ్, ఖమ్మంపాటి రేణుక, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్, కోఆప్షన్ సభ్యుడు ఘాజీ, ఫారెస్టు సబ్‌డివిజన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యానవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## ఇల్లెందుకు నూతన ఐటీఐ కాలేజీ

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 6: ఇల్లెందుకు నూతన ఐటీఐ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడారు. పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఐటీఐ కాలేజీ ఏర్పాటుతో విద్య మరింత సౌకర్యవంతంగా మారుతుందన్నారు. సుమారు రూ 11.52 కోట్ల వ్యయంతో ఐటీఐ కాలేజీని ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. పట్టణంలో ఐటీఐ కాలేజీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని ప్రభుత్వం పరిశీలించి ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. త్వరలోనే ఐటీఐ కాలేజీ అందుబాటులో రానుందని తెలిపారు.

## లక్ష్మయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

ములకలపల్లి, అక్టోబర్ 6: మండలంలోని చౌటిగూడెం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి వర్సా లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పాల్వంచ ఆశ్రమ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు కటుకూరి శేఖర్‌బాబు ఆధ్వర్యంలో చౌటిగూడెం గ్రామానికెళ్లి రూ.10వేలు కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గొగ్గల వెంకటేశ్వర్లు, దేవబత్తిని మోహన్, వలదాసు ప్రవీణ్, నాగేశ్వరరావు, సున్నం నర్సింహారావు, రమేశ్, ఖదీర్, రవికుమార్, రవీందర్, వీరబాబు, కిన్నెర శ్రీను పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థుల కమిటీ బాధ్యులు

# అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చంద్రుగొండ, అక్టోబర్ 6 : అన్నివర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రసూల్ అన్నారు. తిప్పనపల్లి పంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు శుక్రవారం బతుకమ్మ చీరెలను పంపిణీ చేసి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని మతాల పండుగలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ పార్వతి, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, ఉపసర్పంచ్ ధరావత్ పార్వతి, కార్యదర్శి శివ, నాయకులు కల్లేం వెంకటేశ్వర్లు, దావుద్‌మియా తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ : చీరెలు పంపిణీ చేస్తున్న రసూల్

టేకులపల్లి, అక్టోబర్ 6: దసరాను పురస్కరించుకొని మండలంలోని ఉమ్మడి ప్రెగళ్లపాడు గ్రామపంచాయతీ పరిధి రేషన్ షాప్ వద్ద రాంపురం మహిళలకు సర్పంచ్‌లు కణికి రమాదేవి, భూక్యా ఇందిర, ఎంపీటీసీ బానోత్ సరోజని బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఈర్ల లక్ష్మీనారాయణ, సందీప్, బీఆర్ఎస్ నాయకుడు భూక్యా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లి : చీరెలు అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

# సర్కారు కొలువులో సమ్మక్క సక్సెస్



- **తొలి ప్రయత్నంలోనే 'కానిస్టేబుల్'గా విజయం**
- **పోలీసుగా హమాలీ కూతురు**
- **ఆరు నెలల కఠోర శ్రమకు దక్కిన ఫలితం**
- **మున్ముందు ఉన్నతోద్యోగాల సాధనకూ సంకల్పం**



దమ్మపేట, అక్టోబర్ 6 : తాను హమాలీ కూలీ అయితేనేం.. తన కష్టం ఏనాడూ తన కుటుంబానికి తెలియనీయలేదు ఆ తండ్రి. మూటలు మోస్తూ భుజం వంచుకొని వెళ్తున్న తన తండ్రి.. తన విజయాన్ని చూసి తల ఎత్తుకునేలా చేయాలనుకుంది ఆయన మొదటి కుమార్తె. అందుకోసం కఠోర శ్రమ చేసింది. మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించింది. ఆమే.. దమ్మపేట మండలానికి చెందిన బోగి సమ్మక్క. దమ్మపేట మండల కేంద్రానికి చెందిన బోగి సత్యం గిరిజన సహకార సంస్థల్లో హమాలీ. ఆయన భార్య రమణ అంగన్‌వాడీ టీచర్. పెద్ద కుమార్తె సమ్మక్క. రెండో కుమార్తె సారక్క. మూడో కుమార్తె ఆశా. చిన్ననాటి నుంచి చదువులు ముందుండే సమ్మక్క.. ఫస్ట్ నుంచి టెన్త్ వరకూ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివింది. అశ్వారావుపేట వీకేడీవీఎస్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేసింది. ఆ సమయంలోనే పోలీసు ఉద్యోగాలపై దృష్టిసారించింది. అక్కడ వేలాదిమంది యువతీ యువకులు కోచింగ్ సెంటర్లవైపు పరుగులు తీస్తున్నా ఈమె మాత్రం స్వశక్తి మీదనే ఆధారపడింది. సొంతంగానే మెటీరియల్ సేకరించి పరీక్షలకు సన్నద్ధమైంది. శరీర దారుఢ్య పరీక్షల కోసం సొంతంగానే ఆరు నెలల పాటు కఠోర శ్రమ చేసింది. పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. మొదటి ప్రయత్నంలోనే పోలీస్ కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలో 119/200 మార్కులు సాధించింది. ఓపెన్ కేటగిరీలోనే సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. ఉద్యోగం సాధించింది. అయితే, ఈమె సత్యం, రమణ దంపతుల రెండో కుమార్తె సారక్క డిగ్రీ, మూడో కుమార్తె ఆశా ఇంటర్ చదువుతున్నారు.

### మున్ముందు ఉన్నతోద్యోగాల కోసం శ్రమిస్తా..: సమ్మక్క



తల్లిదండ్రుల సహకారంతోనే తొలి ప్రయత్నంలో మహిళా కానిస్టేబుల్‌గా విజయం సాధించాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేదే నా చిన్ననాటి కల. రోజూ 12 గంటల పాటు కష్టపడి చదివా. శరీరదారుఢ్యం కోసం స్వశక్తితోనే సాధన చేశాను. ఈ విజయంతో నా కష్టానికి ఫలితం దక్కినట్లనిపిస్తోంది. ఈ ప్రయత్నాలను ఆపను. మున్ముందు ఉన్నతోద్యోగాల కోసం మరింతగా శ్రమిస్తా.

## 15 నుంచి దసరా పవిత్రోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 6 : బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 24 వ తేదీ వరకు శ్రీ లక్ష్మి శరన్నవరాత్రోత్సవాలు, దసరా పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో అమ్మవారికి వివిధ అవతారాల్లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



క్రీడాకిట్లు అందిస్తున్న జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు

దమ్మపేట, అక్టోబర్ 6 : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పంచాయతీలో క్రీడాకారులకు క్రీడాకిట్లు పంపిణీ చేసి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులకు జిల్లా యువజన క్రీడా, సాంస్కృతిక శాఖ ద్వారా కిట్లను అందించిందన్నారు. క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యత పొంది మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన శాస్త్రవేతలు

టేకులపల్లి, అక్టోబర్ 6 : టేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధి ఏ కాలనీతండా గ్రామానికి చెందిన రైతుల ఫిర్యాదు మేరకు పలు గ్రామాల్లో మిర్చి తోట, పత్తి, వరి పంట పొలాలను జిల్లా కృషి విజ్ఞాన్ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ శుక్రవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ అవసరానికి మించి మిర్చి తోటలకు బయో మందులు వాడడం వల్ల వైరస్ వ్యాప్తికి కారణం అవుతుందన్నారు. మందులు పిచికారీ చేసేటపుడు ఆకుల కింది భాగం తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి అన్నపూర్ణ, శాస్త్రవేత్తలు శ్రీనివాస్, శివ, ఏవో అన్నపూర్ణ, ఏఈవో విశాల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత

భద్రాచలం, అక్టోబర్ 6: భద్రాచలంలో గంజాయిని, రవాణాదారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్లు తిరుపతి, కరంచంద్ తెలిపిన వివరాలు.. భద్రాచలం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఈ అధికారులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద పోలీస్ స్టిక్కర్ అంటించిన కారు నుంచి 80.5 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. కారులో ఉన్న వారిని నిర్మల్‌కు చెందిన ఎస్కే అద్నన్, ఎస్కే అబ్బులు, ముంబైకి చెందిన షఫీ ముల్లా ముస్తాక్ అహ్మద్ ఖాన్, ఎస్కే అఫతక్ ముస్తాక్‌గా గుర్తించారు.గంజాయిని ఒడిశాలోని మల్కాన్‌గిరిలో కొన్నట్లు, ముంబైకు తరలిస్తున్నట్లు నిందితులు తెలిపారు. నిందితుల నుంచి గంజాయిని, కారును, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు.

### మరో ఇద్దరి నుంచి కూడా..

యమహా బైక్‌పై వెళ్తున్న పెద్దపల్లికి చెందిన తీగల శశి, దేవి రవితేజను అధికారులు తనిఖీ చేశారు. వారి నుంచి 9.700 గ్రాముల గంజాయిని, రెండు సెల్ ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. గంజాయిని మల్కాన్‌గిరిలో కొన్నట్లు నిందితులు తెలిపారు. కారు, బైక్ నుంచి స్వాధీనపర్చుకున్న మొత్తం గంజాయి విలువ రూ.26.30లక్షలు ఉంటుంది. ఈ దాడుల్లో సీఐలు ఎస్కే లతీఫ్, వై.సర్వేశ్వర్, సీహెచ్ నాగేశ్వరరావు, ఎస్కే రహీమున్నీసా, ఎస్సైలు అనిల్, మురళి, గౌతమ్, మురళీకృష్ణ, రతన్, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటనారాయణ, సుధీర్, హరీష్, వెంకటేష్, విజయ్, సుమంత్, రాజేష్, అన్వర్ పాల్గొన్నారు.

## బ్రేక్ ఫాస్ట్ స్కీం ప్రారంభం

భద్రాచలం, అక్టోబర్ 6: స్థానిక తాత గుడి సెంటర్‌లోని ఎంపీపీఎస్‌లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ప్రారంభించారు. ఇది మంచి పథకమని అన్నారు.

## మొద్దులమడలో వైద్యశిబిరం

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 6: వినాయకపురం పీహెచ్‌సీ పరిధి మొద్దులమడ గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యుడు రాందాసు 38మంది రోగులను పరీక్షించి జ్వర పీడితులను గుర్తించి మలేరియా లేదని నిర్ధారించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఆజ్మీర వెంకటేశ్వరరావు, రాజు, శ్రీనివాస్, విజయరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.